జై హనుమాన్

హనుమాన్ జయంతి వేడుకలు గురువారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గ వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు శోభాయాత్ర నిర్వహించగా దారి పోడవునా ప్రజలు మంగళహారతులు పట్టారు. శోభా యాత్ర సందర్భంగా బైక్‌ర్యాలీలు నిర్వహించి జై హనుమాన్ అంటూ నినాదాలు చేశారు. పలు ప్రాంతాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, ప్రసాదాలు, పులిహోర, మజ్జిగను అందజేశారు.

– కుత్బుల్లాపూర్


కరవాలాన్ని ప్రదర్శిస్తున్న కూన శ్రీశైలంగౌడ్


భౌరంపేట్‌లో శోభాయాత్ర ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


జగద్గిరిగుట్టలో హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


బాచుపల్లిలో శోభాయాత్రలో


హనుమాన్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్


శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్


గాజులరామారంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న అబిద్


జగద్గిరిగుట్టలో ప్రసాదం పంపిణీ చేస్తున్న హాకర్లు

క్లుప్తంగా

జగద్గిరిగుట్ట ఓబీసీ మోర్చా నూతన కమిటీ

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ ఓబీసీ మోర్చా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం జగద్గిరిగుట్ట బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కమిటీని ప్రకటించారు. ప్రెసిడెంట్‌గా మాదవ్, ప్రధాన కార్యదర్శి మురళిగౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనావాస్‌చారి, నర్సింహులు, కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా స్వామి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనావాస్, ఎం.గోపాల్, బి.గోపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పత్తి రఘుపతి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ భానుచందర్, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుధ, సీనియర్ లీడర్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ ఏఈఈ రాధాకృష్ణారెడ్డి అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో 8వ తేదీన జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలోని 22వ బ్లాక్ వద్ద, 9వ తేదీన చింతల్‌లోని హనుమాన్ ఆలయం వద్ద, 10వ తేదీన అంజయ్యనగర్ కల్లు కంపౌండ్ వద్ద తమ సిబ్బంది ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

జగద్గిరిగుట్ట: చింతల్, పద్మానగర్‌కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. గురువారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజల్లో భాగంగా ఉదయం నిత్య హోమం, పూర్ణాహుతి, బలిహరణం కార్యక్రమాలు చేశారు. ఆ తర్వాత శ్రీనివాస కల్యాణ మహోత్సవం, ఆరగింపు గోష్టి, తీర్థప్రసాదగోష్టి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే శుక్రవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన, శనివారం ద్వాదశ ఆరాధన, ధ్వజరోహణం కార్యక్రమాలు ఉంటాయని కమిటీ తెలిపింది.

బీఆర్ఎస్ నేతకు ఎమ్మెల్సీ పరామర్శ

దుండిగల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నేతను శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పరామర్శించారు. దుండిగల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు శివకుమార్ యాదవ్‌పై బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గాయపడిన శివకుమార్ చింతల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న శంభీపూర్ రాజు గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అతని పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


శివకుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ఆరోగ్యమే మహాభాగ్యం

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో గురువారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సీఎండీ దండు శివరామరాజు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, అన్ని రకాల రోగులకు తమ ఆస్పత్రిలో అత్యాధునికి వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ డీవీఎస్ సోమరాజు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఏఎస్‌ఏ బృందం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ అసెస్‌మెంట్ (ఎన్‌క్యూఏఎస్ఏ) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఓపీ సేవలు, మ ందుల స్టాక్, ఏఎన్‌సీ, ఇమ్యూనైజేషన్ రిజిస్టర్లను పరిశీలించారు. అదే విధంగా స్టోర్‌రూమ్, ల్యాబ్స్, పారిశుద్ధ్య నిర్వహణను తనిఖీలు నిర్వహించి రోగులను వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో.. అసెస్‌మెంట్ బృందం సభ్యులు డాక్టర్ నీతి శర్మ, డాక్టర్ సబీనా లాంగర్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డిప్యూటీ వైద్య వైద్యాధికారి డా. ఆనంద్, కుత్బుల్లాపూర్ వైద్య అధికారిని డా. నవనీత, డా అర్షద్, సీహెచ్‌ఓ మహాలక్ష్మి, సురేష్ బచ్చు తదితరులు పాల్గొన్నారు.


కుత్బుల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎన్‌క్యూఏఎస్‌ఏ బృందం సభ్యులు

జీఓ.58 లబ్ధిదారులతో తహసీల్దార్ కార్యాలయం కిటకిట


పట్టాల పంపిణీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: గాజులరామారంలో నూతనంగా నిర్మించిన కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం రెండు రోజులుగా కిటకిటలాడుతోంది. ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో జీఓ.58 కింద గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 3న మూడు మండలాలకు చెందిన లబ్ధిదారుల్లో కొంతమందికి షాపూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాల పంపిణీ చేసింది. కుత్బుల్లాపూర్ మండల పరిధిలో జీఓ.58 కింద 1200 పట్టాలను రోజువారీగా తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేస్తున్నారు. గురువారం 58 లబ్ధిదారులు హాజరయ్యారు. దీంతో కార్యాలయం ఆవరణలో సందడిగా నెలకొంది.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

చింతల్: శిథిలావస్థకు చేరిన తాగునీటి పైపులైన్లతో నేటి వినియోగదారులకు, అధికారులకు తిప్పలు తప్పడం లేదు. జగద్గిరిగుట్ట నుంచి ఐడీపీఎల్ బాలానగర్ లోకి వెళ్లే 450 ఎంఎం పైప్ లైన్ వేసి సుమారు 40ఏళ్లు కావస్తుంది. ఇటీవల జగద్గిరిగుట్ట నుంచి ఐడీపీఎల్‌కు వచ్చే ఇదే పైపులైన్‌కు ఉషోదయ కాలనీ వద్ద పగుళ్లు ఏర్పడి రెండు మూడు పర్యాయాలు నీటి సరఫరాకు ఆటంకం కలిగింది.దీంతో గురువారం మరమ్మతులు చేపట్టగా జీఎం శ్రీధర్‌రెడ్డి, డీజీఎం విష్ణు, మేనేజర్ ఝాన్సీలు సదరు పనులను పరిశీలించారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని జీఎం శ్రీధర్‌రెడ్డి సాక్షికి తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లోని ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాల కూల్చివేతల పరంపర కొనసాగుతూనే ఉంది. గురువారం దేవేందర్‌లోని సర్వేనం.329 ప్రభుత్వ స్థలంలో వెలిసిన రెండు గదులు, ఒక బేస్‌మెంట్‌ను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో పోలీసు భద్రత మధ్య కూల్చితలు చేపట్టారు. ఈ కూల్చివేతల్లో సిబ్బంది వాసు, నాగు, దేవాలు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు


మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నరసింహారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వాకిటి రాంరెడ్డి

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్‌కు చెందిన అభినవ కవి, మానస టూల్ టెక్ అధినేత వాకిటి రాంరెడ్డి గురువారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్, ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కలెక్టర్ జన్మదినం కావడంతో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాకిటి మాట్లాడుతూ... అదనపు కలెక్టర్‌గా విధి నిర్వహణ, సాహిత్య రంగాలను రెండు కళ్లల్లా భావించి నరసింహారెడ్డి సేవలందిస్తున్నారని ఆయన సేవలను ప్రశంసించారు.

సిగ్నల్ ఏర్పాటు చేయండి లేదా ట్రాఫిక్‌ను నియంత్రించండి

జీడిమెట్ల: జీడిమెట్ల ఫేజ్–1లో వాహనాల ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించేందుకు సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. జీడిమెట్ల ఫేజ్–1లోని సాయికాంట వద్ద ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో ప్రతినిత్యం ట్రాఫిక్ జాం వలన వాహనదారులు ఇబ్బంది పడతున్నారు. జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో ప్రతినిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగులు, కార్మికులు డ్యూటీ నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్నాయి. దీంతో వాహనాలదారులు బయటకు వెళ్లలేక రోడ్డుదాట లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ప్రజలు ట్రాఫిక్ అధికారులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో పోలీసులను నాలుగురోడ్ల కూడలిలో ఉంచి ట్రాఫిక్‌ను నియంత్రించాలని కోరుతున్నారు. లేదా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యలు తొలుగుతాయని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు పట్టించుకుని తగిన చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించాలని కోరుతున్నారు.


జీడిమెట్ల ఫేజ్-1 సాయికాంట వద్ద ట్రాఫిక్‌జామ్

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధి బహదూర్‌పల్లిలోని శ్రీరామ్‌నగర్ గాయత్రి మిడోస్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో గురువారం స్థానిక కౌన్సిలర్ నర్సింగం భరత్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా రోడ్లను విస్తరిస్తామన్నారు.డివైడర్,యూటర్న్,వీధి దీపాలు ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ ఎస్ఈ హుస్సేన్, ఈఈ రమేష్ కుమార్, మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణ, ఏఈ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

8న ఉచిత మెగా వైద్య శిబిరం

నిజాంపేట్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే శిబిరంలో జనరల్ ఫిజిషియన్, ఎండ్రోక్రినాలజిస్ట్, డైటీషియన్, కార్డియాలజిస్టులతో ఫ్రీ కన్సల్టేషన్‌తో పాటు 2డీ ఎకో, ఈసీజీ, ఆర్‌బీఎస్ టెస్ట్‌లపై 50 శాతం రిబేటు ఉంటుందన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య


జ్యోతి (ఫైల్)


దుండిగల్: అనుమానస్పద స్థితిలో ఓ గృహిణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఒడిల మండలం కొల్లనూరు గ్రామానికి చెందిన నరేందర్‌కు వరంగల్ జిల్లా శివనగర్ ప్రాంతానికి చెందిన జ్యోతి(32)తో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి 13, 11 సంవత్సరాల వయస్సు ఉన్న ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. నరేందర్ తన కుటుంబంతో కలిసి సంవత్సరం కిత్రం నగరానికి వచ్చి సూరారం లక్ష్మీనగర్‌లోని సురేందర్‌రెడ్డి అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్నాడు.

- నరేందర్ మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా పని చేస్తుండగా భార్య జ్యోతి గృహిణి. రోజు మాదిరిగానే భర్త ఉద్యోగానికి, పిల్లలు పాఠశాలకు వెళ్లగా జ్యోతి ఇంట్లోనే ఉంది. ఎప్పటిలాగే గురువారం మధ్యాహ్నం పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చి తలుపులు కొట్టగా తెరవలేదు. పక్క పోర్షన్‌లో ఉన్న వాళ్లతో పెద్ద కూతురు తల్లికి ఫోన్ చేయగా ఇంట్లో నుంచి ఫోన్ రింగ్ అయినా స్పందించలేదు. దీంతో కిటికీ పక్కలో నుంచి చేతులతో మెయిన్ డోర్ గడియ తీసి పిల్లలు లోనికి వెళ్లి చూడగా తల్లి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే చుట్టు పక్కల వారికి చెప్పడంతో వారు భర్త నరేందర్, దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కిందకి దించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా జ్యోతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడతామని సీఐ రమణారెడ్డి తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


లక్ష్మయ్య (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ పద్మానగర్ ఫేజ్–2కు చెందిన లక్ష్మయ్య (65) ఈనెల 1వ తేదీన రోజు మాదిరిగా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





బీఆర్ఎస్ నేతకు టీడీపీ నేత పరామర్శ

కుత్బుల్లాపూర్: తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ గురువారం కొంపల్లిలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్, బీఆర్ఎస్ నేత జెమ్మి దేవేందర్ నివాసానికి వచ్చి ఆయనను పరామర్శించారు. ఇటీవల దేవేందర్‌కు ఆపరేషన్ కాగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జ్ఞానేశ్వర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.. గతంలో టీడీపీలో కీలకంగా ఉన్న దేవేందర్‌ను జ్ఞానేశ్వర్ కలవడం చర్చనీయాంశమైంది.


జెమ్మి దేవేందర్‌ను పరామర్శిస్తున్న టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

దుండిగల్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ఆ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆనబోయిన మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ నిలుస్తోందన్నారు. తమ పార్టీ నేతలపై అక్రమంగా కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాముగౌడ్, బీజేపీ నేతలు విగ్నేష్ చారి, శ్యాంరావు, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుచిత్ర చౌరస్తాలో...

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం సుచిత్ర చౌరస్తాలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పులి బలరామ్, ఝాన్సీ, కృష్ణ, నార్లకంటి ప్రతాప్, చిన్నారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, ప్రసాద్ శర్మ, రాజు, తిరుపతయ్య, బి చౌదరి, అంజయ్య, పాపయ్య, సతీష్, బాబీనీల, మాధురి, శ్రవణ్ గౌడ్, సందీప్ గౌడ్, మహేష్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, నాగదీప్ గౌడ్, వర్మ, శ్రవణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మకాలనీలో..

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సూరారం విశ్వకర్మకాలనీలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు బక్క శంకర్‌రెడ్డి, ఎంఎస్ వాసులు హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో దుర్గోధస్‌రావు, కంది శ్రీరాములు, వారాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బీజేపీ నేతలు..


సుచిత్ర చౌరస్తాలో బీజేపీ జెండాను ఆవిష్కరించిన భరతసింహారెడ్డి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029